# సింగిల్ పేజీ కథలు

## నిజం

తండ్రి కోపంగా అతనివైపు చూశాడు. గోపాల్ గజగజా వణుకుతున్నాడు.

అతని వయసు పదిహేను సంవత్సరాలుంటుంది. ఏడో క్లాసు చదువుతున్నాడు. రెండు నెలల్లో అతను పరీక్షలకు హాజరై రాయాలి.

''నీ లెక్కల బుక్కు పట్రా'' అన్నాడు తండ్రి.

కొడుకు వెనక్కి తిరిగాడు. గోడవారగా వున్న పాత ట్రంకు పెట్టెను తెరిచి పుస్తకం కోసం వెతకసాగేడు.

జంకుతూ గోపాల్ ఒక పుస్తకాన్ని తండ్రి చేతిలో పెట్టాడు.

''ఇది నోట్‌బుక్! నేనడిగింది టెక్స్టు బుక్‌రా!'' గర్జించాడతను.

''అది నా ఫ్రెండుకిచ్చాను''

''ఎందుకిచ్చావు? ఎవర్నడిగి ఇచ్చావు. పరీక్షలు దగ్గరకొస్తున్నాయని తెలిసికూడా ఫ్రెండ్‌కిచ్చావా?''

''రేపు తెచ్చుకుంటాను నాన్నా'' అన్నాడు గోపాల్.

''తెస్తావు రేపు వెధవాయి!'' అని వాడి చెవి పట్టుకుని గట్టిగా పిండి, చేతిలో ఉన్న నోట్‌బుక్‌ను వాడిమీదకు విసిరాడు.

కిందపడిన నోట్‌బుక్‌ను గోపాల్ వినయంగా వంగి తీసుకున్నాడు. ఎర్రబడిన చెవిని రాసుకుంటూ తండ్రికేసి చూశాడు.

''మరే బుక్కులేనా ఫ్రెండ్సుకిచ్చావా?''

''సైన్సు బుక్కుకూడా ఇచ్చాను. ఆ రెండే!''


''తతిమ్మా బుక్కులన్నీ నీ పెట్లో వున్నాయా?''

''ఉన్నాయి నాన్నా'' అన్నాడు గోపాల్.

''నిన్ను నమ్మకూడదు. పెట్టె తెరిచి చూస్తే నిజం తెలుస్తుంది'' అని రంగారావు కుర్చీలోంచి లేచాడు. మోకాళ్ళమీద కూర్చుని ట్రంకుపెట్టెను తెరిచాడు. గోపాల్ పక్కనే మౌనంగా నుంచున్నాడు. అట్టడుగునున్న ఏదో పుస్తకాన్ని అతడు బయటకు లాగాడు. దానిమీదున్న పేరు చూసి అతను తుళ్ళి కిందపడ్డాడు.

కొడుక్కి కనపడకుండా ఓ పుస్తకం పేజీలను తిప్పిచూశాడు. వివిధ రకాల భంగిమలు! బూతు బొమ్మలు. రంగారావు ఉగ్రుడై లేచి నుంచున్నాడు. బట్టల స్టేండుమీదున్న బెల్టును చేతిలోకి తీసుకున్నాడు. ఇదంతా గమనిస్తున్న గోపాల్ గుండె దడదడ కొట్టుకుంటోంది. తను చేసిన తప్పేమిటో!

రంగారావు పళ్ళు కొరుకుతూ బెల్టుతో గోపాల్ని నాలుగుసార్లు వాయించాడు. గోపాల్ అరిచాడు, బాధతో ఏడుస్తూ బొబ్బలెట్టాడు.



తల్లి రత్నమ్మ వంటింట్లోంచి పరిగెత్తుకొచ్చింది. కొడుకు ఒంటిమీద బెల్టుదెబ్బలు వాతల్లా కనిపిస్తున్నాయి.

''ఆ బుక్కు ఏమిటో నాకు తెలియదు. దాన్ని పెట్లో నేను పెట్టలేదు'' అన్నాడు గోపాల్ ఏడుస్తూ.

''చేసిన తప్పును ఒప్పుకోడానికి బదులు అబద్ధం చెప్తావా? నీ చర్మం ఒలిచేస్తానురా రాస్కెల్!''

రత్నమ్మ అడ్డుపడింది. బెల్టును ఆమె గట్టిగా పట్టుకుని లాక్కుంది.

''అడ్డులేవే! ఈ వెధవ పాడైపోతున్నాడు'' అరిచాడతను.

''ఏమైందో నాకు చెప్పండి'' అంది రత్నమ్మ.

తన చేతిలో వున్న బుక్కును అతను భార్యకిచ్చాడు.

చూసి ఆమె పుస్తకాన్ని మూసేసింది.

''ఇది నీకెలా వచ్చిందిరా?'' అడిగిందామె.

''నాకు తెలియదమ్మా! ఆ పుస్తకాన్ని నేను చూడలేదు. ఎవరో పెట్టారు నాపెట్లో!'' అన్నాడు గోపాల్ రాగాలు తీస్తూ.

''పచ్చి అబద్ధాలు! వాడు పెట్టకుండా ఆ బుక్కు పెట్లోకి ఎలా వస్తుంది? మన ఇంట్లో పది మంది లేరు. వాడూ, వాడు చెల్లీ, నువ్వూ, నేనూ తప్ప మరెవ్వరూ లేరుగా'' అరిచాడు రంగారావు.

రత్నమ్మ కొడుకును బయటకు పొమ్మంది.

ఏడుస్తూ గోపాల్ బయటకు పరిగెత్తాడు.

''ఈ వెధవ పాడైపోయాడు. వీడికి చదువు రాదు'' అన్నాడు రంగారావు.

అతనిలో తుఫానులా చెలరేగిన ఆగ్రహం ఇంకా తగ్గలేదు. సిగరెట్ వెలిగిస్తున్న అతని చెయ్యి వణుకుతోంది.

ఆమె బెల్టును స్టేండ్‌మీద పడేసింది.

''వాడ్ని ఎడాపెడా వాయించారు. మీరింక శాంతించండి. లేకపోతే మీ ఆరోగ్యం చెడుతుంది. ఆ బుక్కు ఎలా వచ్చిందో నేను తర్వాత కనుక్కుంటాను'' అందామె.

రంగారావు భార్యకేసి చూస్తూ పొగ బయటకు వదిలాడు. ఆయాసపడ్తూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

''ఆ పుస్తకాన్ని ఎక్కడైనా దాచేవా! పిల్లల కంటబడకూడదు'' అన్నాడతను.

ఆమె పుస్తకాన్ని పట్టుకుని హాల్లోకి నడుస్తూ గుమ్మంలో ఆగి వెనక్కి చూసింది.

''మొహం కడుక్కోండి. కాఫీ తెస్తాను'' అందామె నవ్వుతూ.

★ ★ ★

నెలలు దొర్లిపోయాయి. గోపాల్ పరీక్ష రాయడానికి వెళ్లాడు.

రత్నమ్మ తమ్ముడు వీరేశ్ పల్లెటూరి నుంచి అక్క ఇంటికి క్రితంరోజు వచ్చాడు.

గోపాల్ ట్రంక్ పెట్టెను తెరిచి లోపల దేనికోసమో వెతుకుతున్నాడు.

చూస్తున్న రత్నమ్మ గదిలోకొచ్చింది.

అతడు పెట్టె మూతను చటుక్కున కిందకు పడేశాడు.

''ఏమిట్రా వెతుకుతున్నావు?'' అడిగిందామె.

''ఏమీలేదు అక్కయ్యా!''అన్నాడతను.

వీరేశ్ వయసు ఇరవై రెండేళ్ళు. ఇంకా పెళ్లికా లేదు. ఉద్యోగం లేదు. పల్లెటూళ్ళో తోచక అప్పుడప్పుడు పట్నానికొచ్చి అక్కయ్య ఇంట్లో కొన్నిరోజులు ఉండి వెళ్లిపోతూ ఉంటాడు.

అతడిని చూస్తూంటే ఆమెలో ఏదో అనుమానం మొలకెత్తింది. తను దాచిన పుస్తకం కోసం అతను వెతుకుతున్నాడేమో! అడిగితే వీరేశ్ తనతో నిజం చెప్పడు. తను నిజాన్ని తెలుసుకోవాలి.

ఆనాటి మధ్యాహ్నం వీరేశ్ పెట్టెను మళ్లీ వెతికాడు. అతడికి కావలసిన పుస్తకం దొరికింది. దాన్ని అతను జుబ్బా జేబులో దాచుకుని పెట్టె మూసి లేచాడు.

తలుపు వెనుకనించి అక్కయ్య అదంతా చూసిందని అతను తెలుసుకోలేదు. ఆ పుస్తకాన్ని పెట్లో ఆమె పడేసిందని అతడికి తెలియదు.

రత్నమ్మ హాల్లోని సోఫాలో చతికిలబడింది. తన భర్త బెల్టుతో గోపాల్‌ని కొడుతున్న దృశ్యం ఆమెకు జ్ఞప్తికి వచ్చింది. వీరేశ్ చేసిన దానికి తన కొడుకు శిక్షను అనుభవించాడు. ఆమె కళ్ళు నీళ్లతో నిండాయి.

''ఒరే వీరేశ్. నువ్వా పెట్టెలో దాచిన పుస్తకం కారణంగా నీ మేనల్లుడు బెల్టు దెబ్బలు తిన్నాడ్రా!''అరిచిందామె.

వీరేశ్ తలవంచుకుని మౌనంగా ఉండిపోయాడు. ''నీకు తొందరగా పెళ్లి చేసేయమని నాన్నగారికి చెప్తానుండు''అందామె.

రాత్రి గోపాల్, అతని చెల్లెలు భోజనం చేస్తున్నారు. ఆమె కొడుకు వైపు ఆప్యాయంగా చూసింది. తప్పుచేయని పిల్లల్ని శిక్షిస్తే వాళ్ళు మానసికంగా గాయపడ్తారు.

''ఒరేయ్ గోపాల్ ఆ పుస్తకాన్ని నువ్వు పెట్టెలో పెట్టలేదురా!''అందామె.

గోపాల్ సంతోషంగా తల్లి వైపు తిరిగాడు.

''ఎవరు పెట్టారమ్మా?''

''ఎవరైతేనేంలే నువ్వుకాదు'' అందామె.

''అది నాన్నకు చెప్పమ్మా'' అన్నాడతను.

''తప్పకుండా చెప్తాను'' అందామె.

గోపాల్ ఆకలితో ఉన్నాడేమో మరింత తిన్నాడు. ఆ పుస్తకం ఏమిటో అతనికి తెలియదు. కాని తను తప్పుచేయలేదని తల్లి చెప్పినందుకు అతను చాలా ఆనందించాడు. మర్నాడు పరీక్షకు అతను దిగులులేకుండా వెళ్లాడు. నిజం ఆఖరికి నెగ్గుతుందనే విశ్వాసం అతనిలో మెల్లగా నాటుకుంది.

**-బద్దిగం పాండురంగారెడ్డి**
**(జగిత్యాల)**

# పిలుపు

"వెంకట్! కమింగ్ ఫర్ జాగింగ్" అంటూ పిలిచింది అపురూప.

[illegible] వెంకటేశ్వరరావు.

వెంకట్ అని పిలవబడే వెంకటేశ్వరరావు రిటైర్డ్ కస్టమ్స్ కలెక్టరు. సివిల్ సర్వీస్‌లో సెలెక్టయి అంచెలంచెలుగా పైకి వచ్చిన మనిషి. చాలా ఖచ్చితమైన, నిజాయితీకి మారుపేరైన మనిషి. రిటైర్‌మెంట్ తరువాత కొడుకు, కోడలు, మనుమలతో కలిసి హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు. కొడుకు పెద్ద కంపెనీ ఎగ్జిక్యూటివ్. కంపెనీ వాళ్లిచ్చిన బంగళాలోనే వుంటున్నారు. వీళ్ల ఇంటికి రెండో ఇంట్లో వుండే అపురూప అదే కంపెనీలో పనిచేస్తోంది. మంచి జాలీ అయిన మనిషి అంటారు అందరూ, భర్త సత్యంతో సహా. ఆ అమ్మాయే రావుగారిని జాగింగ్‌కు రమ్మని రోజూ పోరు పెడ్తోంది.

సరే ఒకరోజు పొద్దున్నే వ్యాయామం మానేసి, కేవలం మెడిటేషన్ మాత్రం ముగించుకొని జాగింగ్‌కు రెడీగా టీషర్ట్, జాగింగ్ షూస్, వాక్‌మెన్‌తో సహా తయారైపోయారు రావుగారు. అపురూప రానే వచ్చింది.

"కమ్, కమ్ వెంకట్!" అంటూ ఆయన నడుము చుట్టూ చెయ్యేసి పరిగెత్తడం మొదలుపెట్టింది. అనుకోకుండానే రావుగారి చెయ్యి ఆమె నడుముపై పడింది. అపురూప సంగతేమో కానీ రావుగారికి మాత్రం షాక్ తగిలినట్లయింది.


'ఇదేమిటి, భార్యపోయి ఇన్ని సంవత్సరాలలో ఇంతవరకు తనలో ఏ చలనం లేదే. కామాన్ని, ఆ ఆలోచనలను కూడా జయించానని అనుకున్నానే, మరి ఇదేమిటి?' అని మధనపడసాగేరు రావుగారు.

మరుసటి రోజు "జాగింగ్‌కు రాలేనమ్మా అపురూపా!" అంటూ అమ్మా అనే పదాన్ని వత్తి పలికారు రావుగారు.

వెంటనే పేపర్లో మొహం దాచేసుకున్నారు ఏమైనా భావాలు కన్పిస్తాయేమోనని.

ఇంతలో "బాబాయిగారూ! ఎక్కడ" అంటూ చేతిలో స్వీటు డబ్బాతో వచ్చింది పక్కింటి సుజాత. డబ్బా వంటింట్లో అరుగుమీద పెట్టేసి నేరుగా రావుగారున్న చోటికి వచ్చింది.

"ఈరోజు నా పుట్టిన రోజండీ బాబాయిగారూ! ఆశీర్వదించరూ" అంటూ చేతికి అక్షింతలు అందించింది.



"ఆయుష్మతీ భవ. త్వరలో ప్రమోషన్ ప్రాప్తిరస్తు" అంటూ ఆశీర్వదించి, అక్షింతలు వేసి, వీపు నిమిరారు రావుగారు.

'చిత్రం, ఎలాటి స్పందన లేదు. తన కూతురు విద్య లాగానే అనిపించింది.

ఏమిటో ఈ వింత. ఒకే వయసు వాళ్ళయిన సుజాత, అపురూపల స్పర్శలు తనలో ఎందుకింత విరుద్ధభావాలను కలిగించాయి? దీనికి కారణమేమయ్యుంటుంది?' రావుగారి ఐఏఎస్ బుర్ర ఆలోచనలో పడింది.

ఎట్టకేలకు ఒక నిర్ధారణకు వచ్చారు. అవును అంతే అయ్యుండాలి అనుకున్నారు.

అపురూప పూర్తిగా 21వ శతాబ్దపు పిల్ల. అందులోనూ ఆర్మీ వాతావరణంలో పెరిగింది. పాతకాలం మాదిరి అత్తయ్య, మావయ్య, పిన్ని, బాబాయి ఈ పిలుపులన్నీ ఆ పిల్లకు పాతచింతకాయ పచ్చడి. ఆ తరువాతి కాలపు అలవాట్లు అయిన అంకుల్, ఆంటీలు కూడా తన దృష్టిలో ఓల్డ్‌ఫ్యాషనే. పెద్ద, చిన్న అనే తారతమ్యం లేకుండా అందరినీ పేరుతోనే పిలిచే అత్యాధునిక అమెరికన్ సంప్రదాయం అంటే ఆమెకు మక్కువ ఎక్కువ. అందులోనూ పెద్ద ఉద్యోగంలో వుందేమో తనేమి చేసినా అదే మంచి పద్ధతి కింద చెల్లుబాటవుతోంది. అదే అలవాటుతో అపురూప తనని వెంకట్ అని పిలిచింది. కానీ తానుమాత్రం ఆ పిలుపుతో ఒక్కసారిగా ఎంతో వయసు తగ్గినట్లయి తన కాలేజీ రోజులు, ఐఏఎస్ ట్రైనింగ్ రోజులలోకి వెళ్ళిపోయాడు. ఇటీవలి రోజుల్లో ఇంకా ఎక్కడో చెదరు ఒదరు మిగిలిన తన పాత స్నేహితులెవరైనా అంటే తప్ప మిగతా అందరూ తనని ఎంతో గౌరవంగా రావుగారూ, సార్ అనే పిలుస్తారు. అదే అలవాటైన తనకి ఒక్కసారిగా ఒక యువతి వెంకట్ అని ఎంతో సన్నిహితంగా పిలవడంతో తాను యువకుడై పోయాడు. అందుకే ఆ స్పందన. అదే వయసు సుజాత బాబాయిగారూ అనగానే తన చిట్టితల్లి విద్య నాన్నగారూ అని పిలిచినట్లే అనిపించింది.

పిలుపులో ఏముంది అంటారు గానీ, పిలుపులోనే ఇంత మహత్యం వుందిగదా అని ఆశ్చర్యపోయారు వెంకటేశ్వరరావు ఐఏఎస్... సారీ వెంకట్‌గారు.

**-వి.రుక్మిణి (హైదరాబాద్)**